22-02-2025
శనివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 158 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

జయభేరి

# రాహుల్ గాంధీకి గట్టి కౌంటర్

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ వ్యవహరించింది
- దాని వల్లే ఢిల్లీలో బీజేపీ గెలిచింది : బీఎస్పీ నేత మాయావతి




**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 :**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి గట్టి కౌంటర్ ఇచ్చింది బీఎస్పీ నేత మాయావతి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ వ్యవహరించిందని, దాని వల్లే ఢిల్లీలో బీజేపీ గెలిచినట్లు మాయావతి పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో.. ఇండియా కూటమికి బీఎస్పీ మద్దతు ఇవ్వలేదని, ఇది నిరుత్సాహానికి గురిచేసినట్లు ఇటీవల రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బెహన్‌జీ తమతో కలిసి పనిచేస్తే, బీజేపీ నెగ్గేది కాదన్నారు. రాహుల్ చేసిన ఆరోపణలకు ఇవాళ మాయావతి కౌంటర్ ఇచ్చారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఆమె పోస్టు చేశారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్‌లా కాంగ్రెస్ పనిచేసిందన్న విషయం అందరికీ తెలుసు అని, దాని వల్లే బీజేపీ అధికారంలోకి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరిస్థితిలో ఉందని, కనీసం ఆ పార్టీ అభ్యర్థులకు చాలా చోట్ల డిపాజిట్ కూడా దక్కలేదని ఆమె తెలిపారు. ఇతరుల పట్ల వేలు పెట్టి చూపే ముందు, తన స్వంత వ్యవహారాల గురించి సమీక్ష చేసుకోవాలని కాంగ్రెస్ నేతకు మాయావతి సూచన చేశారు.ఢిల్లీలో ఏర్పడిన బీజేపీ సర్కారుకు ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడం పెను సవాల్‌గా మారనున్నట్లు మాయావతి ఆరోపించారు.

# భారతీయ మనస్తత్వంతో..

## ప్రపంచ దృక్పథం ఉన్న నేతలు అవసరం

- ప్రధాని నరేంద్ర మోడీ



**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 :**

భారతీయ మనస్తత్వంతోనే అయినా ప్రపంచ దృక్పథం గల నేతల అవసరం వివిధ రంగాల్లో దేశానికి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఉద్ఘాటించారు. ఢిల్లీలో అంతిమ నాయకత్వ శిక్షణ సంస్థ (ఎస్ఎల్‌యు) సమ్మేళనంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, 'భారతీయ దృష్టితో అంతర్జాతీయ మనస్తత్వంపై అవగాహనతో ముందుకు సాగే వ్యక్తుల అవసరం మనకు ఉంది' అని చెప్పారు. 'ప్రపంచ భావన. స్థానిక పెంపకం' ఉన్న వివిధ రంగాల్లో నాయకుల ఆవశ్యకత ఉందని ప్రధాని ఉద్ఘాటిస్తూ, అధికార యంత్రాంగంలోనైనా, వాణిజ్య రంగంలో లేదా ఏదైనా రంగంలో భారత జాతీయ లక్షాన్ని ప్రతిబింబించే నాయకత్వం కావాలని అన్నారు.ప్రపంచ వేదికపై దేశ ప్రయోజనాలను ప్రోత్సహిస్తూనే ప్రపంచ సంక్లిష్టత, అవసరాలకు పరిష్కారం కనుగొనగల నాయకత్వం ప్రతి రంగంలో కావాలని మోడీ సూచించారు. భారత్ ప్రపంచ శక్తిగా ఆవిర్భిస్తోందని, ఈ ఊపును వేగవంతం చేసే, ప్రతి రంగంలో అటువంటి విజయాలు నమోదు చేసే ప్రపంచ శ్రేణి నేతల ఆవశ్యకత ఉందని ప్రధాని అన్నారు. ఎస్‌యుఎల్ వంటి సంస్థ అటువంటి మార్పు తీసుకురాగలదని ఆయన అన్నారు.వివిధ రంగాల్లో విజయాలను సాధ్యం చేయగల మానవ వనరుల పాత్ర గురించి మోడీ ప్రధానంగా ప్రస్తావిస్తూ, సృజనకు సారథ్యం వహించగల, నైపుణ్యాలను ఉపయోగించుకోగల నాయకులు దేశంలో ఉండాలని సూచించారు. మోడీ ఈ సందర్భంగా గుజరాత్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. సహజ వనరుల కొరత కారణంగా ప్రత్యేక రాష్ట్రంగా గుజరాత్ భవిష్యత్ గురించి ప్రశ్నలు లేవనెత్తారని ఆయన గుర్తు చేశారు. అయితే, గుజరాత్ తమ నేతల కారణంగా సత్ఫలితాలు సాధిస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వజ్రాల గని లేదని, కానీ ప్రపంచంలోని పది వజ్రాల్లో తొమ్మిది గుజరాతీ చేతుల్లో నుంచే వెళుతున్నాయని మోడీ చెప్పారు.



# ఇది పేదల ప్రభుత్వం


కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని, గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలేదన్నారు. మహిళా సంఘాలు మరింత ఆర్థికంగా ఎదగాలని అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడి మరో పది మందికి సహాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంట్లో ఆడబిడ్డ చేతిలో డబ్బు ఉంటే తమ పిల్లల చదువు కోసం, కుటుంబ గౌరవం కోసం ఖర్చు చేస్తారని సీఎం అన్నారు. అందుకే స్వయం సహాయక సంఘాలను ప్రోత్సాహిస్తున్నట్లు సీఎం అనగానే, సభకు వచ్చిన మహిళలు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

పేదవారి ఇంటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణ పేట జిల్లా అప్పకపల్లె గ్రామంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సీఎం 72,045 గృహాలకు శంఖుస్థాపన చేశారు. అనంతరం సీఎం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నామని, సంఘాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని, గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలేదన్నారు. మహిళా సంఘాలు మరింత ఆర్థికంగా ఎదగాలని అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడి మరో పది మందికి సహాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంట్లో ఆడబిడ్డ చేతిలో డబ్బు ఉంటే తమ పిల్లల చదువు కోసం, కుటుంబ గౌరవం కోసం ఖర్చు చేస్తారని సీఎం అన్నారు. అందుకే స్వయం సహాయక సంఘాలను ప్రోత్సాహిస్తున్నట్లు సీఎం అనగానే, సభకు వచ్చిన మహిళలు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

...మిగతాది 2 లో

# ఈటెల వర్సెస్ అరుణ



**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక క్లయిమాక్స్‌కు చేరిందా? రేసులో ఇద్దరు నేతలు మిగిలారా? ఎవరి వైపు అధిష్టానం మొగ్గు చూపుతుంది? తొలుత ఈటెల వైపు మొగ్గు చూపినా, అరుణ అయితే బెటరని ఓ అంచనాకు వచ్చిందా? ఈటెలకు మరో పదవి ఇవ్వాలనే ఆలోచన చేస్తోందా? దీనిపై ఆ పార్టీలో ఎలాంటి చర్చ జరుగుతోంది?తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక ఆలస్యమవుతోంది. తొలుత జనవరి సెకండ్ వీక్‌లో ప్రకటన వస్తుందని జోరుగా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఫిబ్రవరి చివరలో అని అంటున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త అధ్యక్షుడు రాబోతున్నారని వరంగల్ పర్యటనలో వెల్లడించారు. దీంతో పార్టీలో ఏం జరుగుతోందన్న చర్చ నేతలు, కార్యకర్తల్లో మొదలైంది.తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం బీసీల చుట్టూనే తిరుగుతోంది. రాష్ట్ర జనాభాలో 56 శాతం

...మిగతాది 2 లో

# రైతుల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి

- ముఖ్యమంత్రీ చంద్రబాబుపై మండిపడ్డ వైసిపి నేత జగన్ మోహన్ రెడ్డి



**జయభేరి, అమరావతి, ఫిబ్రవరి 21:**

రైతుల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి అని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసిపి నేత జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు తీరుపై వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. తమ లేఖలోనే మిర్చి గరిష్ట ధర రూ. 27 వేలు పలికిందని చెప్పారు. నాడు పెట్టుబడి ఖర్చులకు రూ. లక్ష.. నేడు లక్షన్నర అని విమర్శించారు. ధరలు పడిపోవడంతో ప్రతి రైతు రూ. లక్షకు పైగా నష్టం జరుగుతుందని తెలియజేశారు. రైతుల కోసం కొత్త మద్దతు ధరలు ఎందుకు ప్రకటించలేదని జగన్ ప్రశ్నించారు. పత్తి, పెసర, మినుము, కంది, టమోటా, మిర్చి, ధాన్యం సహా పలు పంటలకు మద్దతు ధర రావడం లేదని దుయ్యబట్టారు.రాష్ట్ర ప్రభుత్వమే ఎందుకు కొనుగోలు చేయడం లేదని, మీ చేతిలో ఉన్న మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకుండా... కేంద్రానికి లేఖలు రాయడంపై రైతులను మోసం చేయడం కాదా?

...మిగతాది 2 లో

# ట్రంప్‌పై నాటో దేశాలు తిరుగుబాటు

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఇది పేదల ప్రభుత్వం

**సీఎం శంకుస్థాపనల వివరాలివే..**

రూ.130 కోట్లతో నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాల, హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన
రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన.
రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన.
రూ.40 కోట్లతో 100 పడకల యూనిట్ కు శంకుస్థాపన.
రూ.296 కోట్లతో తుంకిమెట్ల నారాయణపేట రోడ్, కొత్తకొండ మద్దూర్ రోడ్ అభివృద్ధి పనులకు, అప్పకపల్లి గుండామల్ రోడ్, మద్దూర్ లింగాల్ చెడ్ రోడ్ లలో హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన
రూ.193 కోట్లతో గుల్బర్గా కొడంగల్, రావులపల్లి మద్దూరు, కోస్గి దౌలతాబాద్ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.
రూ.12.70 కోట్లతో నారాయణపేట నియోజకవర్గంలో సిఆర్ఆర్ రోడ్లకు శంకుస్థాపన

**ప్రారంభోత్సవాల వివరాలు**

రూ.56 కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల అకడమిక్ బ్లాకులను ప్రారంభించిన సీఎం
రూ.5.58 కోట్లతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభించిన ముఖ్యమంత్రి.
రూ.1.23 కోట్లతో జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన సీఎం
రూ.7 కోట్లతో మరికల్ మండల పరిషత్ ఆఫీసు కాంప్లెక్స్ భవనం ప్రారంభించిన సీఎం

**మెడికల్ కాలేజీ లో విద్యార్థులతో సీఎం ముఖాముఖి**

నారాయణ పేట మెడికల్ కాలేజీ లో విద్యార్థులతో సీఎం ముఖాముఖిగా మాట్లాడారు. సీఎం మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో ఒక మెడికల్, పారామెడికల్, నర్సింగ్ కాలేజీ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కేంద్రం తిరస్కరించినా.. మా మంత్రి, అధికారులు తీవ్రంగా ప్రయత్నించి ఎనిమిది మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని సీఎం అన్నారు. కాలేజీలో పూర్తి స్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు.నిజమైన పేదవారికి సంక్షేమం చేరినప్పుడే అభివృద్ధి జరిగినట్లని బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారని, అందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మీ అవసరాలపై అవగాహన ఉన్నవారే మీ ఎమ్మెల్యేగా ఉన్నారని, పేదలకు విద్య అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. డాక్టర్ వృత్తి ఒక ఉద్యోగంగా కాకుండ, ఒక బాధ్యతగా గుర్తించాలని సీఎం సూచించారు. మీరంతా గొప్ప డాక్టర్లుగా రాణిస్తే రాష్ట్రానికి మంచి సేవలు అందించగలరని, యాభై ఏళ్లు ఇక్కడి ప్రజలకు సేవలందించిన చిట్టెం నర్సిరెడ్డి పేరు ఈ కాలేజీకి పెట్టడం సముచితమని తాను భావిస్తున్నట్లు సీఎం అనగానే విద్యార్థులు చప్పట్లు మారుమ్రోగించారు.సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనగా, నారాయణ పేట జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఒకే రోజు రికార్డ్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయడం ఇదే తొలిసారిగా పేర్కొన్న ప్రజలు, సీఎం ప్రసంగం సాగినంత సేపు జై కాంగ్రెస్, జై రాహుల్, జైజై రేవంత్ రెడ్డి అంటూ నినాదాలిచ్చారు. సీఎం వెంట మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు ఉన్నారు.

## రైతుల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి

అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంపై ఆధారపడకుండా మార్క్ ఫెడ్ ద్వారా మిర్చిని కొనాలని చెప్పారు. తాను మిర్చి రైతులను కలుసుకుంటే ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందా?నని అన్నారు. రైతులకు బాసటగా వెళ్లినందుకు మాపై కేసులు పెడతారా? నని ఫిబ్రవరి 15న మీ మ్యూజికల్ నైట్ కోడ్ అడ్డం రాలేదా?నని వైఎస్ జగన్ దుయ్యబట్టారు. అన్యాయంగా తమపై కేసులు ఎలా పెడుతారని, ఇది అప్రజాస్వామికం కాదా? అని ప్రశ్నించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పలానా వారికి ఓటు వేయమని కూడా చెప్పలేదన్నారు. తాము ఎన్నికల్లో పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు.

## ఈటెల వర్సెస్ అరుణ

బీసీలు ఉన్నట్లు కులగణన నివేదిక తేల్చింది. ఈవిషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. సంస్థల ఎన్నికల్లో మా పార్టీ 42 సీట్లను బీసీలకు ఇస్తామన్నారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గినా, పార్టీ పరంగా తాము సీట్లు కేటాయిస్తామని స్వయంగా వెల్లడించారు. ఈ క్రమంలో బీజేపీ ఆలోచనలో పడింది.తొలుత ఈటెలను నియమించాలనే దాదాపు ఓ అంచనాకు వచ్చారు. కాంగ్రెస్ పార్టీని అనుసరిస్తే ఆ ట్రాప్‌లో పడ్డామనే అపవాదు వస్తుందని కమలనాథులు భావిస్తున్నారట. ఎలాంటి సమస్య లేకుండా మహిళకు అప్పగిస్తే బాగుంటుందని మెజార్టీ నేతలు చెబుతున్నారు. అలాగైతే రేసులో ఉన్న ఏకైక మహిళ డీకె అరుణ. మహిళా కోటాలో ఆమెని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే ఈటెలకు బిగ్ షాక్ తప్పదని అంటున్నారు. బీజేపీ ఆలోచన వెనుక కారణాలు చాలానే ఉన్నాయట. స్థానిక సంస్థల ఎన్నికల ముందు అధ్యక్షురాలిగా డీకే అరుణను నియమిస్తే పార్టీ మంచి ఫలితాలు వస్తాయని లెక్కలు వేస్తోందట ఆ పార్టీ. దీనిద్వారా దక్షిణ తెలంగాణ లో పార్టీ పట్టు సాధించేందుకు అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన పార్టీలు మహిళలకు అధ్యక్ష పదవి ఇచ్చిన సందర్భం లేదు. ఇది పార్టీకి కలిసి వస్తుందని భావిస్తోందిడీకే అరుణ విషయానికొస్తే.. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన అనుభవం ఆమె సొంతం. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఎంపీగా కొనసాగుతున్నారు. అరుణకు పగ్గాలు అప్పగిస్తే పార్టీ బలోపేతం అంచనా వేస్తున్నారు. గతంలో కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా పని చేశారామె. కేంద్రం మైనార్టీ, వక్ఫ్ బోర్డు ఆస్తుల కమిటీలో సభ్యురాలిగా కొనసాగుతున్నారు.సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన తర్వాత తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా డీకే అరుణకు అవకాశం కల్పిస్తారని ఆమె వర్గీయులు భావించారు. అయితే ఆ పదవి బండి సంజయ్‌కు దక్కింది. మరో పదవి వస్తుందని ఆమె చాలా ఆశలు పెట్టారు. ఇటీవల జరిగిన రాష్ట్రాల్లో ఎన్నికల్లో వరుసగా బీజేపీ విజయం సాధించింది. ఈ క్రమంలో ఢిల్లీ స్థాయిలో పైరవీలు మొదలైనట్టు తెలుస్తోంది. మొత్తానికి తెలంగాణ బీజేపీ నేతల ఉత్కంఠకు ఎప్పుడు తెరపడుతుందో చూడాలి.

## అలిగి ఇంటిని విడిచిపోయిన బాలికలు

■ సురక్షితంగా అప్పగింత

**జయభేరి, గన్నవరం:**

కాలేజీకి సరిగా వెళ్లడం లేదనే కోపంతో తల్లిదండ్రులు మందలించారని, మనస్థాపానికి గురై ఇంటి నుండి పారిపోయిన ఐదుగురు మైనర్ బాలికలను గుర్తించి, సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పజెప్పారు గన్నవరం పోలీసులు. వివరాల్లోనికి వెళితే గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన సల్మాన్ ఖాన్ అనే వ్యక్తి తన కుమార్తెను కాలేజీకి గైర్హాజరయిందని మందలించి, నాలుగు రోజులుగా కాలేజీకి పంపకుండా ఇంటి దగ్గరే ఉంచారు. గురువారం రాత్రి బాలిక తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి పడుకుంది. కాలేజీకి పంపకుండా ఇంటి దగ్గరే ఉంచుతున్నారని, తీవ్ర మనస్థాపానికి గురైన ఆ మైనర్ బాలిక, మిగిలిన నలుగురు స్నేహితురాళ్లతో కలిసి తెల్లవారుజామున ఇంటి నుండి చెప్పకుండా వెళ్లిపోయింది. తెల్లవారుజామున 02:00 గంటల సమయంలో చూడగా తన కుమార్తె కనిపించకపోవడంతో, కంగారుపడిన తండ్రి సల్మాన్ ఖాన్ చుట్టుపక్కల బంధువులను, తన స్నేహితురాలను విచారించారు. తన కుమార్తెతో పాటు మరో నలుగురు స్నేహితురాళ్ళు కనబడడం లేదని వారి తల్లిదండ్రులు చెప్పడంతో, అందరూ కలిసి ఇంటి నుండి వెళ్లిపోయారని గ్రహించారు. వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 112 కాల్ చేసి తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ కంప్లైంట్ ను గన్నవరం పోలీస్ స్టేషన్కు బదిలీ చేయగా, ఫిర్యాదు స్వీకరించిన గన్నవరం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారు ఏ ఏ మార్గాల గుండా వెళ్ళిందీ తెలుసుకుని, వారు పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ లో ఉన్నట్లుగా గుర్తించి, అక్కడి పోలీసుల సహకారంతో వారిని గుర్తించి, కౌన్సిలింగ్ చేసి గన్నవరం స్టేషన్కు చేర్చారు.

# ట్రంప్‌పై నాటో దేశాలు తిరుగుబాటు

**అమెరికాలో ట్రంప్ రాకతో... ప్రపంచ రాజకీయాలు ఎప్పుడూ లేనంత ఆసక్తికరంగా మారాయి. ప్రపంచ పెద్దన్నగా అమెరికాలో ట్రంప్ రాక.. అంతర్జాతీయంగా అనూహ్యమైన మార్పులకు కారణం అయ్యింది. ప్రెసిడెంట్ ట్రంప్ టారీఫ్‌ల థ్రెట్ నుండీ.. నాటో సైనిక ఖర్చుల వరకూ యూరప్‌ను ముప్పు తిప్పలు పెట్టడానికి రెడీ అయ్యారు. అసలు ఎన్నికలు గెలవడానికి ముందు నుండే యూరప్‌ను బెదిరించడం మొదలు పెట్టారు ట్రంప్.**



నాటోకి కేటాయింపులు పెంచని యురోపియన్ దేశాలపై రష్యాను ఉసిగొల్పుతానంటూ వార్నింగ్ ఇచ్చారు. అక్కడ మొదలైన ఈ రెవల్రీ ఇప్పుడు మరింత రాజుకుంది.ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధంలో.. మధ్యవర్తిత్వానికి రెడీ అయిన ట్రంప్.. ఒంటి పోకడతో.. యూరప్ పెత్తనం అవసరంలేదని చెప్పారు. అంతేనా.. అవసరమైతే అభిప్రాయాలు తెలియజేయండి కానీ.. తగుదునమ్మా అని నిర్ణయాలు తీసుకోవద్దూ అంటూ రుబాబు చేశారు ట్రంప్. యూరప్‌తో సంబంధం లేకుండా సౌదీలో రష్యా అధికారులతో మంతనాలు మొదలుపెట్టారు. దీనితో... యురోపియన్ దేశాలు ఈగోపై బాంబ్ వేసినట్లయ్యింది. యూరప్ నాయకుల్లో ఆందోళన పెరిగింది.ఉక్రెయిన్ ఫ్యూచర్ గురించి రష్యాతో చేస్తున్న చర్చలకు అమెరికా తమను ఆహ్వానించకపోవడంతో యూరప్ దేశాలు తీవ్రమైన అసంతృప్తికి గురయ్యారు. దీనికి తోడు... యూరప్‌పై కక్ష్యగట్టిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను "అతి త్వరలో" కలవనున్నానని డొనాల్డ్ ట్రంప్ అనడం.. అదీ, తమ భద్రతా ఆందోళనలను అస్సలు పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంపై యూరప్ నిప్పులు చేరుగుతోంది. అయితే, అమెరికాకు ఎదురెళ్లడానికి యూరప్ ఎలాంటి స్టెప్ తీసుకుంటుంది అనేది ఆసక్తిని రేపుతోంది. ఇప్పటికే, ఒత్తిడిలో ఉన్న యూరప్.. తమ రాజకీయ విభేదాలు, దేశీయ ఆర్థిక ఆందోళనలను పక్కనపెట్టి.. భద్రతా వ్యయాన్ని పెంచుతూ.. ఉక్రెయిన్ భవిష్యత్తుపై ఒకే తాటిపైకి ముందుకు వస్తాయా అన్నది చర్చనీయాంశమయ్యింది.ఉక్రెయిన్‌కు సాయంగా దళాలను పంపడం సాధ్యమేనా అనే సందేహాలు వస్తున్నాయి. ఉక్రెయిన్ వ్యవహారంలో మొదలైన చర్చల టేబుల్‌పై తమను తాము బలవంతంగా ఉంచుకోవడానికి యురోపియన్ యూనియన్ దేశాలు ప్రయత్నిస్తున్నాయా అనిపిస్తోంది. ఇక, డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీని తీసుకురాడానికి ప్రయత్నిస్తేనే.. బ్రిక్స్ దేశాలపై గుర్రుమన్న డొనాల్డ్ ట్రంప్.. అలాంటిది, యూరప్.. అమెరికాకు ఎదురెళితే.. ట్రంప్ ఏం చేస్తారో అనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో.. వచ్చే నాలుగేళ్లూ.. యూరప్ వర్సెస్ ట్రంప్‌లా ప్రపంచ రాజకీయాలు మారాతాయా అనే డౌట్ వస్తోంది.ఇప్పటి వరకూ అమెరికాను అడ్డం పెట్టుకొని రష్యా దగ్గర కాలర్ ఎగరేస్తున్న యూరప్ దేశాలకు ఈ సందర్భం మరింత క్లిష్టంగా మారింది. అమెరికా అధ్యక్షుణ్ని యూరప్‌కు భాగస్వామి అని ఒప్పించడం అత్యవసరంగా మారింది. దానికి ఒక చిన్న అవకాశం కోసం వేచి చూస్తున్న యూరప్‌కు ట్రంప్ తీరు అడ్డంగా మారింది. అందుకే, పారిస్ సమావేశం ద్వారా ట్రంప్‌ను ఎలా తమ వైపుకు తిప్పుకోవాలా అనే ప్లాన్ చేస్తోంది యూరప్. ఇక, డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేసిన రెండు ప్రధాన అంశాలపై యూరప్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఉక్రెయిన్ పోరాటంతో సంబంధం లేకుండానే నాటో కూటమి దేశాలు జిడిపిలో రెండు శాతం మొత్తాలను నాటో కోసం ఖర్చు చేయాలని ఎప్పటి నుంచో యూరప్ పైన అమెరికా ఒత్తిడి తెస్తోంది. యూరప్ రక్షణకు అమెరికా ఎందుకు మూల్యం చెల్లించాలని మొదటిసారి అధికారంలో ఉన్నపుడే ట్రంప్ ప్రశ్నించారు. అయితే, రెండోసారి గద్దెనెక్కిన తర్వాత.. ఇప్పుడు కనీసం 5 శాతం నాటోపై కూటమి దేశాలు ఖర్చుచేయాలని అంటున్నారు. అయితే, ఇప్పటి వరకూ నాటో దేశాల రక్షణ ఖర్చును అమెరికా దాదాపు 3.5 శాతం పెడుతుంటే.. రష్యాతో సరిహద్దును పంచుకునే పోలండ్, బాల్టిక్ దేశాలు కూడా తమ సైనిక బలగాలపై రెండు శాతాన్ని మించి ఖర్చు చేస్తున్నాయి.నాటోలో ప్రస్తుతం 32 సభ్య దేశాలు ఉన్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనానంతరం తూర్పు యూరప్‌లోని అనేక దేశాలు నాటో కూటమిలో చేరాయి.

అల్బేనియా, బల్గేరియా, హంగరీ, పోలండ్, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, రొమేనియా, లిథువేనియా, లాత్వియా, ఈస్టోనియా దేశాలు నాటో పంచన చేరాయి. ఇక, ఉక్రెయిన్ మీద రష్యా దండయాత్ర తర్వాత 2022లో స్వీడన్, ఫిన్లాండ్ నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. దశాబ్దల తరబడి ఈ రెండు దేశాలు తటస్థంగా ఉన్నాయి. ఇక, రష్యాతో 13 వందల 40 కిలో మీటర్ల పొడవున సరిహద్దు కలిగిన ఫిన్లాండ్ 2023లో నాటోలో చేరింది.ఇక, 2024లో స్వీడన్ కూడా చేరింది. అయితే, స్వీడన్ చేరికను మొదట టర్కీ, హంగరీ వ్యతిరేకించినా చివరకు అంగీకరించాయి. స్వీడన్, ఫిన్లాండ్ చేరడం వల్ల 1990 తర్వాత నాటో భారీ విస్తరించినట్లయ్యింది. ఈ రెండు దేశాల నుంచి మిత్రరాజ్యాల సైన్యానికి మూడు లక్షల మంది సైన్యం జత కలిసినట్టయింది.


**యూరప్, అమెరికా మధ్య ఉన్న చిరకాల బంధం ముగింపు దశకు చేరుకుందని, ఈ విషయాన్ని యూరప్ దేశాలు అర్థం చేసుకోవాలని ఇటీవల అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల్ని జెలన్స్కీ మ్యూనిచ్‌లో జరిగిన భద్రత సదస్సుల్లో గుర్తు చేశారు. ఇక, శిక్షణా విన్యాసాల సాకుతో రష్యా తన మిత్రదేశమైన బెలారస్‌కు సైన్యాన్ని పంపాలని యోచిస్తోందని.. ఇది నాటో దేశాలకు ప్రమాదమని హెచ్చరించారు.**

ఇక, ఉక్రెయిన్, బోస్నియా, హెర్జ్‌గోవ్నియా, జార్జియా కూడా త్వరలో నాటోలో చేరడానికి ఆరాటపడుతున్నాయి.ట్రంప్ ప్రెసిడెంట్‌గా రెండోసారి పదవి చేపట్టిన తర్వాత.. పలు వివాదస్పద వ్యాఖ్యలతో ప్రపంచమంతా తనవైపు చూసేలా చేసుకున్నారు. ముందు, పనామా, మెక్సికో, కెనడాలను యునైటెడ్ స్టేట్స్‌లో చేర్చుకుంటామని చెప్పారు. అంత్య కీలక వ్యూహాత్మక ప్రాంతమైన గ్రీన్ లాండ్‌ను ఆక్రమించుకుంటానని కూడా అన్నారు. అయితే, ప్రస్తుతం ఐరోపా దేశమైన డెన్మార్క్ ఆధీనంలో ఉన్న గ్రీన్ లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అంత సులువైన పని కాదు. ఇప్పుడు.. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన డెన్మార్క్, నాటో కూటమిలో సభ్యదేశంగా ఉన్న కెనడాలకు ట్రంప్ అంటే కాలిపోతోంది. కాబట్టి యూరప్‌కు సొంత సైన్యం అవసరమని చాలా మంది అభిప్రాయపడుతున్నారనీ.. ఇప్పుడు ఆ టైం వచ్చిందని జెలెన్స్కీ అన్నారు.

యూరప్, అమెరికా మధ్య ఉన్న చిరకాల బంధం ముగింపు దశకు చేరుకుందని, ఈ విషయాన్ని యూరప్ దేశాలు అర్థం చేసుకోవాలని ఇటీవల అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల్ని జెలన్స్కీ మ్యూనిచ్‌లో జరిగిన భద్రత సదస్సుల్లో గుర్తు చేశారు. ఇక, శిక్షణా విన్యాసాల సాకుతో రష్యా తన మిత్రదేశమైన బెలారస్‌కు సైన్యాన్ని పంపాలని యోచిస్తోందని.. ఇది నాటో దేశాలకు ప్రమాదమని హెచ్చరించారు.అయితే, ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరడంలో విఫలమైతే దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సి ఉంటుందన్నారు ప్రెసిడెంట్ జెలెన్స్కీ. అమెరికా సైనిక మద్దతు లేకుండా తమ దేశం రష్యాను ఎదుర్కోలేదని ఒప్పుకున్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో తమకు ట్రంప్, సైనిక సహాయాన్ని ఆపివేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్, జెలెన్ స్కీలతో ఫోన్‌లో మాట్లాడారు., ఉక్రెయిన్ విషయంలో రష్యాతో శాంతి చర్చలకు సిద్ధపడిన ట్రంప్.. యూరప్‌ను రెచ్చగొట్టే విధంగా ఒక పనిచేశారు. శాంతి పరిష్కారంలో భాగంగా ఏ దేశాలు ఉక్రెయిన్‌కు దళాలను మోహరించడానికి సిద్ధంగా ఉంటాయి..? రష్యాపై ఆంక్షలను పెంచడానికి ఏ ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటాయి..? వాటిలో ఇప్పటికే ఉన్న వాటిని మరింత కఠినంగా అమలు చేయడం వంటి ఆరు అంశాలపై ప్రశ్నలతో కూడిన ఒక పత్రాన్ని అమెరికా యూరోపియన్ మిత్ర దేశాలకు పంపింది. అయితే, నాటోలో అమెరికా రాయబారిగా ఉన్న జూలియాన్ స్మిత్ దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి సంక్లిష్టమైన దౌత్య పనికి సాధారణంగా వారాల తరబడి సమావేశాలు జరుగుతాయనీ.. ఇలా ప్రశ్నాపత్రాలు నింపినంత మాత్రాన పరిస్థితిని చక్కదిద్దడం సాధ్యం కాదని అన్నారు.ఇక, పారిస్‌లో యూరప్ నాయకులు ఏది సాధించినా, ఉక్రెయిన్‌పై చర్చల్లో సీటు సాధించకపోతే.. అది యూరప్ సూసైడ్ చేసుకున్నట్లే అనుకోవాలి. ఇప్పుడు యూరప్ ముందున్న దారి--- చివరి నిర్ణయం తీసుకోడమే. ముఖ్యంగా, భద్రతా పరంగా ఉక్రెయిన్ నుండి.. లేకపోతే.. యూరప్ నుండే దూరంగా ఉండాలని అమెరికా ప్లాన్ చేస్తే.. యూరప్ కచ్చితంగా తమ రక్షణ కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. తమ సైన్యాన్ని పెంచుకోవాలి. ఎందుకంటే, అమెరికా అడ్డులేకపోతే--- రష్యాను ఆపడం ఎవరి తరం కాదు. దానికి, యూరప్ ఎప్పుడూ అప్రమత్తంగానే ఉండాలి.

# క్రమబద్ధీకరణకు ఓకే..

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తీపి కబురు చెప్పింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉంటూ ప్రజలకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఇబ్బందిగా మారిన ఎల్ఆర్ఎస్ పై కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైంది.కేవలం మూడు నెలల్లో తేల్చి క్రమబద్ధీకరించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగేశారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక టీమ్ లను రెడీ చేశారు. గడిచిన నాలుగేళ్లుగా పెండింగులోవున్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఎల్ఆర్ఎస్ ఫీజులోనూ 25 శాతం రాయితీ ఇచ్చింది ప్రభుత్వం.సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మార్చి 31లోగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ వర్తించనుంది.బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి ఆధ్వర్యంలో ఈ అంశంపై సమీక్ష జరిగింది.ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను వేగంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని పేర్కొంది. అనుమతి లేని లే అవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై గతంలో ప్రభుత్వం నిషేధం విధించింది. వాటిని కొనుగోలు చేసినవారికి నాలుగేళ్లుగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. వీరందరికీ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పెండింగులో ఉన్నవారు.. లే అవుట్లలో విక్రయం కాకుండా పెద్ద సంఖ్యలో మిగిలిన ప్లాట్లకు కూడా క్రమబద్ధీకరణ అమలయ్యేలా ప్రస్తుతం వెసులుబాటు కల్పించింది ప్రభుత్వం. ఒక లే అవుట్‌లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయ్యాయి. మిగిలిన 90 శాతం ప్లాట్లు రిజిస్టరు కాలేదు. ఎల్ఆర్ఎస్ కింద వాటి క్రమబద్ధీకరణతోపాటు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు.

ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసి విక్రయ దస్తావేజు కలిగిన వారంతా మార్చి 31లోగా స్పందిస్తే రాయితీ కూడా లభిస్తుంది. నాలుగేళ్లుగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం చాలామంది పేద ప్రజలు, రియల్ సెక్టార్ ఎదురు చూస్తోంది. వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం, ఈ వెసులుబాటు కల్పించింది. దాన్ని వినియోగించుకోవాలని మంత్రులు సూచించారు.ఎల్ఆర్ఎస్ అమల్లో పలు వెసులుబాట్లు కల్పిస్తున్నందున నిషేధిత జాబితాలోని భూముల ప్లాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటులో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకునే సౌకర్యం కల్పించింది.అక్రమ లేఅవుట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అప్పటి బీఆర్ఎస్ సర్కారు ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)2020 ను అమల్లోకి తెచ్చింది. రూ.వెయ్యి చొప్పున ఫీజు విధించి దరఖాస్తులు ఆహ్వానించింది. వారిలో చాలా మంది స్పందించారు. కొన్నింటిని పరిశీలించి పరిష్కరించారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులకు లోబడి ఫీజు చెల్లించి నిర్మాణాలకు అనుమతులు పొందారు కొందరు. అయితే మెజారిటీ దరఖాస్తులు మాత్రం పెండింగ్‌లో ఉండిపోయాయి. 14 శాతం ఫీజులు చెల్లించి భవన నిర్మాణాలకు అనుమతులు పొందారు. చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టడంతో కదలిక మొదలైంది.రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చినట్టు ప్రభుత్వ వర్గాల మాట. వాటిలో 9 లక్షలకు సంబంధించి మాత్రమే పరిష్కారం లభించింది. కేవలం 39 రోజుల్లో వీలైనన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి వుంది. రాయితీ ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు ముందుకు రావచ్చని భావిస్తోంది ప్రభుత్వం.

## మహిళలు స్వయం ఉపాధి పొందాలి..

■ లహరి డిజైనర్ సంధ్య

**జయభేరి, కమాన్ పూర్ :**

మహిళలు స్వయం ఉపాధి పొందాలని లహరి డిజైనర్ బోటిక్(పెద్దపల్లి) ప్రొప్రైటర్ పోలు సంధ్య అన్నారు. రామగిరి మండలం కల్వచర్ల లో ఆర్.ఎస్.కే ఆపన్న హస్తం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా శిబిరంలో శిక్షణ తీసుకున్న మహిళలకు ఎన్.ఎ.సి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. మహిళలు నైపుణ్యాన్ని సాధించి ఆయా రంగాల్లో నిలదొక్కుకోవాలన్నారు.ఎవరు ఊహించని విధంగా గొప్ప ఆలోచనతో ఎన్ని కోట్లు ఉన్నా సరే ఎవరు ధైర్యం చేయలేని విధంగా రేండ్ల శారద కుమారస్వామి దంపతులు ఆర్.ఎస్.కె ఆపన్న హస్తం అనే స్వచ్ఛంద సంస్థ నిర్మించి దాని ద్వారా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, అన్నదానాలు,ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు ఆర్థిక సహాయాలు,ఆలయాలకు విరాళాలు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.

ఐనప్పటికీ తన గ్రామంలోని నిరుద్యోగ యువతుల కోసం,ఆడబిడ్డల కోసం వారు స్వయం ఉపాధి కల్పించుకునే విధంగా వారి కాళ్ల మీద వాళ్లు నిలబడాలని తన సొంత ఖర్చుతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి,ట్రైనర్‌కు వేతనాలు చెల్లిస్తూ శిక్షణ పూర్తయ్యి ఎన్. ఎ. సి సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందే వరకు కూడా ప్రతిరోజు భోజనం పెడుతూ,ఇంకా తన గ్రామంలోని మహిళలకు ఏదో చేయాలని పరితపిస్తున్న రేండ్ల దంపతులను ఈ సందర్భంగా అభినందించారు.కాగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో ఒకరోజు ప్రత్యేక శిక్షణ తీసుకొని పరీక్షలు నిర్వహించి మహిళలకు విలువైన సర్టిఫికెట్లు అందజేయడం ద్వారా మహిళలు తాము ఎంచుకున్న కుట్టుమిషన్ రంగంలో ఆర్థిక పరంగా రాణించడానికి అవకాశం ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో రత్నాపూర్ తాజామాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు,ఎన్.ఎ.సి కన్స్ట్రక్టర్ సవిత,లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాస్, కుట్టు మిషన్ ట్రైనర్లు శ్యామల స్వప్న, కవిత, శివ పటేల్, మహేందర్ మహిళలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధుల వరద

- చిల్కానగర్ కు స్టాండింగ కమిటీలో 6 కోట్ల నిధులు మంజూరు కార్పొరేటర్ బన్నాల
- చిల్కానగర్ డివిజన్ కు 6 కోట్ల నిధులు మంజూరు చేసిన GHMC మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన కార్పొరేటర్ బన్నాల




**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్ కు మరోసారి భారీగా నిధులు మంజూరయ్యాయి. ఈసారి ఒకటో రెండో కోట్లు కాదు ఏకంగా 6 కోట్ల నిధులు మంజూరయ్యాయని, చిల్కా నగర్ చౌరస్తా వివేకానంద విగ్రహం నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు స్ట్రాం వాటర్ డ్రైన్ పైప్ లైన్ కొరకు 6 కోట్ల రూపాయల నిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీలో ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు శాంక్షన్ చేయించడం జరిగింది.

చిల్కానగర్ డివిజన్ ప్రధాన రహదారి వివేకానంద స్టాచ్యూ నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు స్ట్రాం వాటర్ డ్రైన్ పైప్ లైన్ బాగా దెబ్బతిన్నదని నూతన స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ ఏర్పాటు చేయాలని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి కోరిన వెంటనే లక్ష్మారెడ్డి మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో చిల్కానగర్ డివిజన్ కి స్ట్రాం వాటర్ పైప్ లైన్ కొరకు నిధులు శాంక్షన్ చేయాల్సిందిగా కోరడం జరిగింది.

వెంటనే స్పందించిన జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో చిల్కానగర్ డివిజన్ ప్రధాన రహదారి స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ కొరకు 6 కోట్ల రూపాయలు శాంక్షన్ చేయడం జరిగింది.

అనంతరం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ అనునిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారని వారు పెట్టిన ప్రతిపాదనను వెంటనే సాంక్షన్ చేస్తానని చెప్పి సాంక్షన్ చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గతంలో వైకుంఠ ధామం కొరకు 3 కోట్ల రూపాయలు నిధులు శాంక్షన్ చేశారని ఈసారి 6 కోట్ల రూపాయలు చిల్కానగర్ డివిజన్ కి శాంక్షన్ చేసినందుకు వారికి చిల్కానగర్ డివిజన్ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే చిల్కానగర్ డివిజన్ కి నిధుల సాంక్షన్ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి చిల్కానగర్ డివిజన్ ప్రజల తరఫున, మా తరఫున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ తెలిపారు.



## నియోజక వర్గంలో సుడిగాలి పర్యటన

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**జయభేరి, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 21:**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శనివారం నాడు నియోజక వర్గంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్ననున్నారు, అబ్దుల్లా పూర్ మెట్ లోని బ్రిలియంట్ కాలేజీ (బాట సింగారం) డ్రగ్స్ పై వ్యతిరేక ప్రతిజ్ఞ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు, అనంతరం అబ్దుల్లా పూర్ మెట్టు మండలానికి సంబందించిన 1 కోటి 63 లక్షల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణి పెద్ద అంబర్ పేట్ ఇందిరా గార్డెన్స్ లో ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొంటారు, అనంతరం రాందాస్ పల్లి చౌరస్తాలో 10 కోట్ల 50 లక్షల వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం (పోచారం, కర్ణం గూడ) దర్శనం చేసుకొంటారు. ఇబ్రహీంపట్నం టౌన్ బస్తీదవాఖాన ప్రారంభం, ఖానా పూర్ బస్తీ దవాఖాన ప్రారంభం. కార్యక్రమంలలో నియోజికవర్గం లోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే రంగారెడ్డి తో కలిసి పాల్గొంటారు,

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

- పలు రికార్డుల పరిశీలన



**జయభేరి, ఫిబ్రవరి 21:**

శామీర్ పేట్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రెవెన్యూ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ యాదగిరి రెడ్డి అదనపు కలెక్టర్ కు రికార్డులకు సంబందించిన వివరాలను వివరించారు. అదేవిధంగా రికార్డు రూమ్ లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. భూ సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందికి అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడిఎం శ్రవణ్ , డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త,సీనియర్ అసిస్టెంట్ అంజాత్, ధరణి ఆపరేటర్ ఆజం తదితరులు పాల్గొన్నారు.

## ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో కుల గణన సర్వే పూర్తి

**జయభేరి, ఘట్కేసర్:**



ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు బాల లక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసిన ఘట్కేసర్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు M ముత్యాలు యాదవ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ మునిసిపల్ లో 95% పూర్తి అయినా కుల గణన సర్వే అన్నారు, ఇంకా 5% కూడా ప్రజలు ఇండ్లలో లేకపోడవడం వలన అవలేదు అని, అసంపూర్తి సర్వే కాదు పూర్తిస్థాయి సర్వే నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పూర్తి స్థాయి నిర్వహించి క్షేత్ర స్థాయిలో వివరాలను పొందుపరచలని కుల గణన పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ కేవలం ఎన్నికలలో పోరాడే రాజకీయ పార్టీ కాదు. రాజ్యాంగంలో పొందుపరచబడిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం యొక్క వాగ్దానం వైపు భారతదేశ ప్రజలందరినీ కలిపే ఉద్యమం కూడా ఇది. భారతదేశం ఈ ప్రయాణంలో పురోగమిస్తున్న కొద్దీ, మన సమాజం మారిపోయింది మరియు సహజంగానే, సమాజం, రాజకీయాలు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా మారాయి. ఈ ప్రక్రియలోని ప్రతి అడుగులోనూ, సమాజ అవసరాలను అర్థం చేసుకోవడంలో, భారతదేశం గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్, ఆజాద్ మార్గంలోనే ఉండేలా చూసుకోవడానికి అవసరమైన రాజకీయ పనిని గుర్తించడంలో భారత జాతీయ కాంగ్రెస్ పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధా కృష్ణ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ కడుపోలా మల్లేష్, sc సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షులు గాజుల వీరేందర్ యాదవ్, మైనార్టీ అధ్యక్షులు ఫరూక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ్ రెడ్డి, యూత్ వైస్ ప్రసిడెంట్ రఫిక్, నాయకులు సిరాజ్, కాయుమ్, బాబు, కడుపోలా రాజు, మేకల సునీల్ కుమార్, ఫాయుమ్, తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సమాజం అభివృద్ది కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

- నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి
- మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..
- గౌడ సమాజం అభివృద్ధి కోసం మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి చేస్తున్న కృషి అభినందనీయం
- తమ సమాజం అభివృద్ధి కోసం రేఖ గౌడ్ చేస్తున్న కృషి పలువురి మహిళలకు ఆదర్శం
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 21 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం నాడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ,సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి చేతుల మీదుగా మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖాగౌడ్ ఆధ్వర్యంలో నర్సారెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ గౌడ సమాజం అభివృద్ధి కోసం మోకు దెబ్బ గౌడ జన హక్కుల పోరాట సమితి చేస్తున్న కృషి అభినందనీయమని, ఒక మహిళగా ఉండి అటు వ్యాపారంలో ఇటు గౌడ సమాజం అభివృద్ధి కోసం తన వంతు పాత్ర వహిస్తూ పలువురి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖ గౌడ్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని నర్సారెడ్డి అన్నారు. గౌడ సమాజం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్,నాయకులు విరూపాక శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్,సమీర్, చిట్కుల శివారెడ్డి, మల్లారెడ్డి,వూడెం శ్రీనివాస్ రెడ్డి,శంకర్ గుప్త,స్వామి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం

**జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 21 :**




మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల వర్గల్ లో నేడు అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం ఘనంగా జరిగింది... ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రాచార్యులు డాక్టర్ గడ్డం భాస్కర్ రావు మాతృభాషను కాపాడుకోవాలని మాతృభాషలో విద్యా బోధన జరగాలని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు.. కళాశాల ఉప ప్రాచార్యులు పి గోవిందరావు తెలుగులో ఉన్నటువంటి ఛందస్సు అవధానం మొదలగు ప్రక్రియలు యొక్క గొప్పతనాన్ని వివరించారు.కళాశాల విద్యార్థులు భాష ఔన్నత్యాన్ని తెలుపుతూ నాటికను వేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.



## ఉప్పల్ ఎమ్మెల్యేని కలిసిన సోనియా గాంధీ ఫేస్ 3 నూతన కార్యవర్గం

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసిన సోనియా గాంధీ ఫేస్ 3 నూతన కార్యవర్గం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, నూతన అధ్యక్షులు నల్లోల కనకయ్య, కార్యదర్శి మాదాసు చంద్రం, కోశాధికారి చరక వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆకుల సంతోష్, సంయుక్త కార్యదర్శి వి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**జయభేరి, ఉప్పల్ :**

జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ అశోక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పరిష్కారించవలసిన డ్రైనేజీ వ్యవస్థ మరియు వాటర్ వర్క్ పలు సమస్యలపై మరియు చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల కొరకై నిధుల మంజూరి గూర్చి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డు కార్పొరేటర్ ప్రభుదాస్ BRS పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, భైరీ నవీన్ గౌడ్, నేమూరీ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కీసర గుట్ట బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



**జయభేరి, కీసర :**

శివరాత్రి సందర్భంగా కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని శుక్రవారం నాడు ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కీసర గుట్ట చైర్మన్ తాటకం నారాయణ శర్మ, టెంపుల్ డైరెక్టర్లు ఉన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం




**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్ లోని సత్య నగర్ కాలనిలో జరుగుతున్న నూతన భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు, ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణంలో తాగు జాగ్రత్తలు తీసుకోవాలని, పైప్ లైన్ నిర్మాణంలో సమీపంలో ఉన్నటువంటి మంచి నిట్టి పైప్ లైన్ లకు ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు నిర్వహించాలని వారు తెలిపారు. ఈ పరిశీలనలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, జలమండలి సూపర్వైజర్ బాలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ ఆదేశాల మేరకు సెక్రెటరీ పై విచారణ

- నాయకులైన, అధికారులైన దళితుల పట్ల వివక్షత చూపితే ఊరుకునేది లేదు
- నిజ నిజాలు తెలుసుకొని కలెక్టర్ కు నివేదిక ఇస్తాం... డిపిఓ లత



**జయభేరి, ములుగు, ఫిబ్రవరి 21 :**

మాదిగ వర్గీయ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పంచాయితీ కార్యదర్శిని విధులు నుండి బహిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ఇలాంటి సంస్కృతి గ్రామాల్లో పారుకు పోతుందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేట జిల్లా ములుగు మండల పరిధిలోని వాగునూతి పంచాయతీ కార్యదర్శి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఫోన్ లో సంభాషిస్తూ మాదిగ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు,మాదిగ కులస్తులు స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. కాగా పంచాయితీ కార్యదర్శి యధావిధిగా విధులకు హాజరవుతుండటంతో రెండు రోజుల క్రితం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుబిగె మహేష్, ములుగు మండల అధ్యక్షుడు ఆదాసు మహేష్, ఆయా మండలాల నాయకులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ కి పంచాయితీ కార్యదర్శిపై పిర్యాదు చేశారు. ఇక పై అధికారుల సూచన మేరకు శుక్రవారం డీపీఓ లత వాగునూతి గ్రామానికి విచారణ నిమిత్తం వచ్చి ఇరువర్గాల వాదనలు విన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్నామని, ఈ విచారణ పత్రాలను పై అధికారులకు నివేదిక పంపుతామని డిపిఓ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఏళ్లుగా, ఊహ తెలిసినప్పటి నుండి గ్రామంలోని అన్ని వర్గీయులను సమానంగా చూసే పంచాయితీ కార్యదర్శి ఇలాంటి మాటలు మాట్లాడటం చూడలేదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కార్యదర్శిపై చర్యలు లేకపోతే ఈ విధంగానే దురదృష్టకర సంఘటనలు జరిగి కులాల మధ్య వాగ్వాదాలు జరిగే ప్రమాదం ఉందని వారు వాపోయారు. కావున ప్రభుత్వ అధికారులు చొరవచూపి ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో,క్షీరసాగర్ గ్రామ అధ్యక్షుడు గుడ్ల అశోక్,ఉపాధ్యక్షుడు మల్లేష్,కొల్తూర్ కులస్తులు సురేష్,నల్ల శ్రీనివాస్ ఆదాసు సురేందర్,నల్ల నరేష్, పోచయ్య మాదిగ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## నూతన సిసి రోడ్ పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం

**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి సూర్య నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమకు సమాచారం అందించాలని, రానున్న రోజుల్లో హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని వారు తెలపడం జరిగింది. ఈ పరిశీలనలో సూర్య నగర్ కాలనీ ఈస్ట్ అధ్యక్షులు యాదగిరి గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు రాజ వర్ధన్ రెడ్డి, భాస్కర్, దశరథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్

- లావుడియా బాషా నాయక్, జాతీయ అవార్డు గ్రహిత



**జయభేరి, దేవరకొండ :**

శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286.వ జయంతిని విలేజ్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా జాతీయ అవార్డు గ్రహిత లావుడియా బాషా నాయక్ భోగ్ బండరో కార్యక్రమం నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడిన మహనీయులు సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. దేశం, ధర్మం పట్ల సంత్ సేవాలాల్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం పని చేశారని, సేవాలాల్ మహరాజ్ దైవాంశ స్వరూపులని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా ఎన్ .రవి, వి.గోపి, ఎన్.శాంతి, ఎన్ జయ శిక్షణ పొందుచున్న మహిళలు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన




**జయభేరి, దేవరకొండ :**

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో మార్చి నెలలో 24, 25 తేదీలలో జరగనున్న సమ్మెకు ఈరోజు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరకొండ శాఖ నందు బ్యాంకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించినారు. ఈ సందర్భంగా నల్గొండ AO module OBC ఆర్గనైజింగ్ సెక్రటరీ NVT మాట్లాడుతూ డిమాండ్స్ గురించి వివరించినారు .రిక్రూట్మెంట్ ఆల్ క్యాడర్స్ వారికి ఇవ్వాలని. టెంపరరీ ఎంప్లాయిస్ని రెగ్యులర్ చేయాలని,5 డే బ్యాంకింగ్ ఇంప్లిమెంట్ చేయాలని, బ్యాంకు ఉద్యోగులకి భద్రత కల్పించాలని,IBA వద్దా పెండింగ్ లో ఉన్న డిమాండ్స్ వెంటనే నెరవేర్చాలని, బ్యాంకు ఉద్యోగుల వెల్ఫేర్ బెనిఫిట్స్ మీద ఇన్కమ్ టాక్స్ వసూలు చేయరాదని, బ్యాంకులని ప్రైవేటీకరణ చేయొద్దని, ఈ సందర్భంగా తెలియజేస్తూ ప్రతి ఒక్క బ్యాంక్ ఉద్యోగి సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ చరణ్ ,ప్రశాంత్, క్యాష్ ఆఫీసర్ గోపాలకృష్ణ, శాంతా నాయక్, శ్రీధర్, మనిషా, సాయి కిషోర్, వెంకట్ , వెంకన్న, చక్రపాణి, రాజకుమార్, ప్రవీణ్ ,కలమ్మ, శ్రీకాంత్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంది

- మారపాక వెంకటమ్మకు పరామర్శించిన.. జనసేన పార్టీ ఇంచార్జ్ చందు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజకవర్గ మారపాక వెంకటమ్మ గత నాలుగు రోజుల కిందట ప్రమాదవశాత్తుగా కింద పడడంతో తలకు బలమైన గాయం కావడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది డాక్టర్లు వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స కోసం తీసుకెళ్లడం జరిగింది డాక్టర్లు ఎమర్జెన్సీ వార్డులో ఉంచి వైద్యం అందించగా వెంటనే ఆపరేషన్ చేయాలనే డాక్టర్లు నిర్ధారించడంతో ఆర్థిక స్తోమత లేకపోవడం వలన జనసేన పార్టీ ఇంచార్జ్ చందు నాయక్ విషయం తెలియజేయగానే హటాహుటిన హైదరాబాద్ వెళ్లి వెంకటమ్మను చూసి పరామర్శించి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పరిశీలించి తీసుకున్నందుకు రాష్ట్ర నాయకులకు విషయం తెలియజేయగానే వారికి పార్టీ అండగా నిలబడుతుందని అన్నారు అతి త్వరలో రాష్ట్ర నాయకులతో మాట్లాడి క్రియాశీలక సభ్యత్వం ద్వారా ఆర్థికంగా జనసేన పార్టీ ఆదుకుంటుందని చందు నాయక్ అన్నారు.

# కాలి బూడిదైన ఈత చెట్లను పరిశీలించిన సిఐ

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



**జయభేరి, గజ్వెల్, ఫిబ్రవరి 21 :**

గుర్తుతెలియని వ్యక్తులు ఈత చెట్లను కాల్చడంతో అహ్మదిపుర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ కొత్త పల్లి నర్సగౌడ్ ,వైస్ ప్రెసిడెంట్ బోర్రనా సత్యనారాయణ గౌడ్, సభ్యులు కొత్తపల్లి వెంకటేష్ గౌడ్, కొత్తపల్లి బాల్ రాజు గౌడ్, కొత్తపల్లి బాలు గౌడ్ , కొత్తపల్లి చిన్న వెంకట్ గౌడ్, గజ్వేల్ సీఐ సైదాకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన గజ్వేల్ సీఐ సైదా శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ఈత చెట్లను దహనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈత చెట్లను కాల్చిన వ్యక్తులు ఎవరైనా సరే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్లమ్మ గుడి దగ్గర చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల వలన ఎలాంటి నేరాలు జరగకుండా అరికట్టడానికి సిసి కెమెరాలు సహాయ పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం సభ్యులు రామ గౌడ్, బాల్ నర్స్ గౌడ్, జగన్ గౌడ్, అంజా గౌడ్, ముత్యం గౌడ్, నాగ మల్లయ్య గౌడ్, దుర్గయ్య గౌడ్, వెంకట్ గౌడ్, నర్సింలు గౌడ్, లింగ గౌడ్, ఎల్లగౌడ్, లక్ష్మణ్ గౌడ్, రాములు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్, సిల్వేరి బాలరాం గౌడ్, వేంకట్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



**జయభేరి, గజ్వెల్, ఫిబ్రవరి 21 :**

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ నిలబెట్టుకొవాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణు అధ్వర్యంలో గజ్వేల్ డిప్యూటీ తహశీల్దార్ కి వినతిపత్రం ద్వారా ప్రభుత్వానికి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 24 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. రానున్న 202526 బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని అసర్ నివేదిక స్పష్టం చెసిందన్నారు. అసర్ నివేదిక ప్రకారం 5.4 శాతం పాఠశాలలో టాయిలెట్స్ లేవని 19 శాతం బడులు పాడుబడ్డాయని పేర్కొన్నది. పాఠశాల లో 27శాతం బాలికలకు మూత్రశాలల సౌకర్యం లేవని అసర్ నివేదిక తేల్చిందన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 2024 అబ్స్ట్రాక్ నివేదిక ప్రకారం 11.95 శాతం పిల్లలు డ్రాప్ అవుట్ గా మారి బడి బయట ఉన్నారని తెలియజేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అంతర్జాతీయ మోడల్ స్కూల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని ,ప్రతి మండల కేంద్రంలో ప్రారంభించాలని విన్నవిస్తున్నామన్నారు. గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలను నిర్మించాలని కొరుతున్నామన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, గురుకులాలలో, సంక్షేమ వసతి గృహాలలో పౌష్టికాహారం అందించాలని, ప్రభుత్వ పర్యవేక్షణ మరింత పకడ్బందీగా చేయాలి. ప్రభుత్వ విద్యాలయంలో నాణ్యమైన, సమాన విద్యను అందించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని కోరుతున్నామన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్ధిని గెలిపించాలి

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి హుజురాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి
- హుజురాబాద్ నియోజకవర్గం చైతన్యవంతమైనది
- పార్టీ అభ్యర్థి గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి
- పార్టీ కో-ఆర్డినేటర్ ల సమావేశంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం




**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 21:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని, హుజురాబాద్ నియోజకవర్గం నుంచి మంచి మెజారిటీ ఇవ్వాలని పరకాల ఎమ్మెల్యే రెవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణ, మండల కోఆర్డినేటర్ల సమీక్షసమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గం నుండి సత్తా చాటాలని కోఆర్డినేటర్ లను కోరారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓటరును నేరుగా కలవాలని సూచించారు. ప్రతి కార్యకర్త కష్టపడితేనే విజయం సాధిస్తామని తెలిపారు. పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అది ఓటర్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ నాయకులు పాల్గొన్నారు.





## కోలాట బృందానికి రూ. 40 వేలు

**జయభేరి, పీ ఏ పల్లి :**

కోదండపురం వెంకటేశ్వర స్వామి ఆలయం చిన్న తిరుపతి గా పిలవబడే వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా జాతరలో నిర్వహించే కోలాట బృందానికి స్పాన్సర్ గా 40 వేల రూపాయలను ఆలయం చైర్మన్ గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి కి స్వామివారి సన్నిధిలో అందించడం జరిగింది. రాజశేఖర్ రెడ్డిని ఆలయ కమిటీ శాలువాతో సత్కరించినారు.

## సందీప్ మౌనిక గృహప్రవేశం మహోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండలో కలారు సందీప్ కుమార్మౌనిక వారి నూతన గృహప్రవేశం, కూతురు జస్మిక వైష్ణవి నూతన పట్టు వసలంకరణ మహోత్సవం కు విచ్చేసి దేవరకొండ వీడియో ఫోటోగ్రాఫర్ మిత్రులు ఆశీర్వదించినారు.

## పెద్దమ్మ గుడి నిర్మాణానికి విరాళం అందజేత

- విరాళం అందజేస్తున్న జైపాల్ రెడ్డి



**జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 21 :**

వర్గల్ మండలంలోని మైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి అలయ అభివృద్ధి కొరకు తన వంతు సహాయం మేదిని రామకృష్ణారెడ్డి కుమారుడు జయపాల్ రెడ్డి శుక్రవారం ముదిరాజు సంఘం పెద్దల సమక్షంలో రూ.3 లక్షల.రూపాయలను అందజేశారు. అనంతరం జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతుగా పెద్దమ్మ తల్లి ఆలయాన్నీ మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్ని కులాల వారికి సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే జైపాల్ రెడ్డికి గ్రామస్తులు అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలారం గ్రామస్తులు, ముదిరాజ్ సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్డంగా బుక్కైన జగన్



**జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 21:**

ఏదైనా చేస్తే నమ్మేలా చేయాలి. అబద్ధం ఆడినా అద్దంలో ఉండాలి. లేకుంటే ఇబ్బందులు ఎదుర్కోవడం తప్పదు. రాజకీయాల్లో రకరకాల జిమ్మిక్కులు చేసే వ్యూహకర్తల బృందాలు వచ్చాయి. ఆపై సోషల్ మీడియా విభాగాలు చాలా రకాల కసరత్తులు చేస్తాయి. అయితే ఇప్పుడు అవి చేసే ప్రయత్నాలు ఇట్టే తెలిసిపోతున్నాయి. నిన్నటి కి నిన్న విజయవాడ సబ్ జైలులో ఉన్న వల్లభనేని వంశీ మోహన్ ను పరామర్శించారు జగన్మోహన్ రెడ్డి. ఆ క్రమంలో జైలు బయట జరిగిన ఓ ఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జగన్మోహన్ రెడ్డి పై ఓ బాలిక పెంచుకున్న పిచ్చి ప్రేమ బయటపడింది. అయితే దీని వెనుక ఐపాక్ టీం ఉందని తేలిపోయింది.జగన్మోహన్ రెడ్డితనకంటే.. ఎక్కువగా నమ్మింది ఐప్యాక్ టీంనే. వాళ్లు నిలబడమంటే నిలబడతారు. కూర్చోమంటే కూర్చుంటారు.

అంతలా ఉంటుంది జగన్మోహన్ రెడ్డి పై ఐప్యాక్ టీం ప్రభావం. 2019లో తన విజయానికి ఐ ప్యాక్ టీం కారణమని జగన్మోహన్ రెడ్డి బలంగా నమ్మారు. అయితే 2024లో ఓటమికి కూడా అదే ఐప్యాక్ కారణమని చెప్పిన జగన్మోహన్ రెడ్డి వినడం లేదు. ఇంకా వారినే నమ్ముకుంటున్నారు. దీంతో పాత చింతకాయ పచ్చడి మాదిరిగా వారు ఏవేవో స్కీములు వేస్తున్నారు. అందులో భాగంగానే విజయవాడ సబ్ జైలు వద్ద జరిగిన చిన్నారి యాక్షన్ అంటూ ప్రచారం నడుస్తోంది.విజయవాడ రోడ్ షోలో ఓ చిన్నారి ఏడుస్తూ జగన్ వద్దకు చేరుతుంది. తండ్రి భుజాల మీద కూర్చోబెట్టుకుని దగ్గరకు తీసుకెళ్లాడు.

వ్యక్తి వ్యక్తి కుక్క పెట్టి జగన్మోహన్ రెడ్డి దగ్గర తీసుకున్నారు. ఆ పాప వెంటనే సెల్ఫీ తీసుకుని ఆనందించింది. అయితే అక్కడితో ఆ ఎపిసోడ్ ముగియలేదు. చదువుకున్న ఏడుపు ఆపేసి సెల్ఫీ తీసుకోవడమే ఫక్కున నవ్వు తెప్పించే అంశం. మొత్తం ఇది ఒక డ్రామాను తలపించింది. ఐ ప్యాక్ నాటకంగా భావించిన టిడిపి సోషల్ మీడియా వెతికి వెతికి మరి పట్టుకుంది. తెర వెనుక ఏం జరిగిందో వివరించే ప్రయత్నం చేసింది. అయితే అలా ఏడ్చిన చిన్నారి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని.. ఆమె తండ్రి బంగారు నగల దుకాణంలో మంచి ఉద్యోగం చేస్తున్నాడని.. తల్లి కూడా ప్రైవేటు ఉద్యోగి అని.. పాప చదివేది రవీంద్ర భారతి స్కూలులో అని తేలిపోయింది. అంటే అది ఉన్నతమైన కుటుంబమే కదా. దీంతో ఈ టోటల్ వ్యవహారం ఒక ఫన్ ఎపిసోడ్ గా మిగిలిపోయింది. ఐప్యాక్ చేసిన నాటకాలుగా తేలిపోయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఇదో ప్రతికూల ప్రభావం చూపుతోంది.

ఈసారి నిజంగా జరిగిన ఘటనలను బయటపెట్టినా.. అదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సృష్టి అని భావించేలా పరిస్థితికి వచ్చింది.

**చిన్నారి దేవిక చుట్టూ స్టోరీ**

చిన్నారి దేవిక.. ఈ పేరు ఇప్పుడు మారుమోగిపోతోంది. ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఇలా ఏ సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ ఓపెన్ చేసిన ఈ చిన్నారి పేరే వినిపిస్తోంది. అందుకు కారణం ఆ చిన్నారి వైఎస్ జగన్‌ను చూడాలంటూ ఏడుస్తూ మరీ ఫొటో దిగడం.. ఆ ఫొటో, వీడియోలు వైరల్ కావడం.వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల వల్లభనేని వంశీ పరామర్శించేందుకు విజయవాడలోని జిల్లా కారాగారానికి వచ్చారు. దీంతో జగన్ ను చూడడానికి వైసీపీ అభిమానులు అక్కడికి భారీగా చేరుకున్నారు. అందులో దేవిక అనే పాప కూడా అక్కడికి వచ్చింది. జగన్ తో ఫొటో దిగడానికి పట్టుబట్టింది దీంతో జగన్ బయటకు వచ్చి ఆమెను ముద్దాడారు. అనంతరం ఆ చిన్నారి జగన్‌తో సెల్ఫీ తీసుకుంది.

**దేవికపై ట్రోలింగ్స్**

ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. దీంతో ఆమెపై ట్రోలింగ్ మొదలైంది. ఒక్కొక్కరు ఒక్కో విధంగా ట్రోలింగ్ చేయడం మొదలు పెట్టారు. అందులో ఒకరు ట్వీట్ చేస్తూ.. ''సొంత నిర్ణయాలు తీసుకోడు.. ఐ ప్యాక్ ఏమి చెప్తే అది చేస్తాడు'' అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఇంకొరేమో ''సొంత మేన అల్లుడి & మేన కోడల్ని మోసం చేసినోడు.. ఊళ్ళో ఉన్నోళ్ళకి మేన మామ.. వాళ్ళ వయసు ఏంటి చేయుస్తున్న పనులేంటి'' అంటూ ట్వీట్ చేశారు.

అలాగే స్వంత చెల్లిని, బాబాయి కూతురుని పేటిఎం బ్యాచ్‌తో బూతులు తిట్టించే ఈ మహానుభావుడు.. జనాల పిల్లల్ని మాత్రం ప్రేమగా చూస్తాడని నమ్మే వెర్రి గొర్రెలు ఆంధ్రాలో లేరని ఇంకా తెలియదా.. ఐ ప్యాక్ డ్రామాలు ఆపండ్రా.. చిరాకేస్తుంది అంటున్నారు. ఈ మేరకు కావాలనే వైసీపీ వాళ్లు ఈ డ్రామా చేయించారంటున్నారు. అక్కడి దిగిన ఫోటోలకు సంబంధించి కెమెరా యాంగిల్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. మరోవైపు ఆ చిన్నారి తల్లినే మార్చేసి.. వేరొకరితో పోల్చుతున్నారు. దీంతో రాజకీయాల కోసం ఆ చిన్నారి తల్లినే మార్చేసిన సోషల్ మీడియా సైకోలు అంటూ ఇంకొందరు విరుచుకు పడుతున్నారు. అలాగే మరొకరు ''ఈ అభిమానం ఐప్యాక్ సొంతం, అసలు ఐప్యాక్ లేకపోతే మీకు ఇలాంటి వీడియోలు ఎక్కడ నుంచి వస్తాయ్..! మీ పేటీఎం బ్యాచ్‌కి దండాలు పెట్టాల్సింది'' అంటూ అందుకు సంబంధించిన వీడియోలు షేర్ చేస్తున్నారు. ''ఐ ప్యాక్ టీం రంగంలోకి దిగింది అనుకుంటా ఇంకా ఇలాంటివి ఎన్నో వస్తాయో.

కానీ ప్రతీ సారి జనాలను మోసం చేయలేవు జగన్'' అంటూ మరొకరు ట్వీట్ చేశారు. లా టీడీపీ ఫ్యాన్స్ విమర్శలు చేస్తుంటే.. వైసీపీ ఫ్యాన్స్ మాత్రం ఇలాంటి అభిమానం, ప్రేమ వైఎస్ జగన్‌కు మాత్రమే సొంతం అంటూ మరోవైపు వీడియోలు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఇక ఆ చిన్నారి దేవిక అలాగే ఆమె ఫ్యామిలీ పై కొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దేవిక తండ్రి ఓ షాప్‌లో పాట్నర్ అని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ వాస్తవంగా ఆ చిన్నారి తండ్రి ఒక షాప్‌లో నెలవారీ జీతానికి పనిచేస్తున్నారని తెలిసింది. అలాగే వీరికి ఒక అపార్ట్‌మెంట్ ఉందని అంటున్నారు. కానీ వారు ఉండేది ఒక అపార్ట్‌మెంట్‌లోని అద్దెకు అని తెలుస్తోంది. ఇక ఆ చిన్నారి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. అయితే వాస్తవం ప్రకారం.. దేవికా రవీంద్ర భారతిలో చదువుతున్నట్లు తెలిసింది. ఇక ఆ పాపపై ఎందుకు ఇన్ని ట్రోలింగ్స్ చేస్తున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ చిన్నారి విషయంలో టీడీపీ, వైసీపీ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టుల యుద్ధం చేస్తున్నారు. ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. దీంతో ఎవరి వాదన కరక్టో తెలియక నెటిజన్లు జుట్టు పీక్కుంటున్నారు.



## చల్లా పరామర్శ

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 21:**

హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ సౌరం సంపత్ తల్లి యాకమ్మ మృతిచెందగా ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి. అదేవిధంగా గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన స్పందన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లేని పోని ప్రయత్నాల్లో టీడీపీ

**జయభేరి, కాకినాడ, ఫిబ్రవరి 21:**

అధికారం అనేది ఒక మత్తు లాంటిది. అందులోనూ రాజకీయాల్లో ఒక్కసారి ఆ మత్తు తలకెక్కితే ఎలాంటి పనైనా చేయిస్తుంది అంటారు తలపండిన పాలిటీషియన్లు. ఇప్పుడు తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొడవలు ఎన్నిక విషయంలో కూటమి అదే తప్పు చేస్తుందా అన్న అభిప్రాయం చాలా మందిలో కలుగుతుంది.తుని మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. వాటిలో ఒక సభ్యుడు మృతి చెందగా ఇంకా 29 కౌన్సిలర్లు ఉంటే అవన్నీ వైసీపీకి చెందినవే. వారిలో ఇటీవల 10 మంది టీడీపీలోకి జంప్ చేశారు. మిగిలిన వారిలో 18 మందిని మున్సిపల్ చైర్మన్ సుధారాణితో సహా క్యాంపులో ఉంచారు వైసీపీ నేతలు. లేకుంటే వారిని అధికార పార్టీ తమ వైపు లాగేస్తారనేది వారి భయం. తిరుపతిలో జరిగింది అదే. ఇప్పుడు అదే వ్యూహంతో పదేపదే తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా నాలుగోసారి కూడా అదే జరిగింది. ఎన్నిక జరపాలంటే కనీసం 14 మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉంటుంది. కానీ ఆసంఖ్య ఎప్పుడు 10 దాటడం లేదు. వారు కూడా వైసీపీ నుంచి టిడిపిలోకి జంపు చేసిన వారే. మరోవైపు తమకు అన్యాయం జరుగుతుందంటూ వైసిపి కీలక నేతలైన ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి, కన్నబాబు, దాడిశెట్టి రాజా, ముద్రగడ పద్మ నాభం లాంటివారు పిలుపునిచ్చిన చలో తుని కూడా ఆగిపోయింది. దీంతో తుని పరిసర ప్రాంతాల్లో మంగళవారం అంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం జనాల్లో ఇదే టాపిక్ పై చర్చ మొదలైంది. ఆల్మోస్ట్ రాష్ట్రంలో ఏకపక్షంగా అధికారంలో ఉంది కూటమి. మరో ఒకటి రెండేళ్లలో మున్సిపాలిటీలు వాళ్ళ వశం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ మాత్రం దానికి అనవసరమైన ఇగోలకి టిడిపి వెళ్తుందా అన్న చర్చే సోషల్ మీడియాలో ఎక్కువగా జరుగుతోంది. ఈ నెపాన్ని తునిలో దశాబ్దాలపాటు తిరుగులేని నాయకుడిగా వెలుగొందిన యనమల రామకృష్ణుడుపై పెడుతున్నారు. 2024 ఎన్నికల ప్రచారాన్ని గుర్తు చేసుకుంటే వైసీపీ అధినేత నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన స్లోగన్ కళ్ళ ముందు కదలాడుతుంది. "వైనాట్ 175" అంటూ చేసిన హడావుడి మామూలుది కాదు. అసెంబ్లీలోని మొత్తం సీట్లు తమకే రావాలన్నది ఆయన స్లోగన్. అంటే అసలు సభలో ప్రతిపక్షమే ఉండొద్దా అని అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయ్. దాన్ని అహంకారంగా ప్రచారం చేసిన అప్పటి ప్రత్యర్థులు ఇప్పుడు తాము కూడా అదే బాటలో ఉండడాన్ని ప్రజాస్వామ్యవాదులు తప్పు పడుతున్నారు.

# వైసీపీకి నాని సెగ...

## పవన్ పై కామెంట్స్ కు దూరం



**జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 21:**

ఎన్నికల్లో అంత ఘోరంగా ఓడడానికి కారణాలేంటని విశ్లేషించుకుంటున్న టైమ్‌లో ఆ ఒక్కడి జోలికి వెళ్లకుంటే బాగుండేదని..నేతల తమ మనోగతం బయటపెట్టారట. పవన్‌ను పర్సనల్‌గా అటాక్ చేయడం వల్లే కాపులు తమకు దూరమయ్యారని భావిస్తున్నారట వైసీపీ నేతలు. సేనానిని విమర్శించడం వల్ల యూత్ ఓట్లు కూడా తమకు పోలరైజ్ కాలేదని అనుకుంటున్నారట.

పలువురు నేతల సూచనల ప్రభావమో..లేక వైసీపీ అధినేతే వాస్తవాలను గమనించారో తెలియదు కానీ..సేనాని జోలికి మాత్రం వెళ్లడం లేదంటున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు పవన్ లక్ష్యంగా మాటల తూటాలు పేల్చేవారు వైసీపీ నేతలు. జగన్‌తో సహా ఆయన మౌత్ పీస్‌లుగా ఉన్న నేతలంతా..సేనానిని గట్టిగా అటాక్ చేసేవారు. పవన్ రెండు పెళ్లిళ్లు చేసుకున్నారని..చంద్రబాబుకు దత్తపుత్రుడని విమర్శించేవారు. అలా పవన్‌ను ఒంటరిని చేయడం లేదా పవన్ రాజకీయ ఎత్తుగడలను చిత్తు చేస్తే చాలు తనదే అధికారమనే భావనలో ఉండేవారట వైసీపీ లీడర్లు.అందుకే అప్పుడు ఎక్కడికి వెళ్లినా పవన్‌పై పర్సనల్ అటాకింగ్ చేసేవారని అంటున్నారు. వైసీపీ సోషల్ మీడియాలో కూడా జనసేనానినే టార్గెట్ చేసేవారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత సేనాని సెగ ఏంటో తెలిసి వచ్చిందంటున్నారు. పవన్‌పై ఎక్కుపెట్టిన బాణాలు మిస్ ఫైర్ అయ్యాయనే అభిప్రాయానికి వచ్చారట. అందుకే ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌పై విమర్శలు తగ్గించి, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌నే టార్గెట్ చేస్తున్నారని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో పవన్‌ను ఎక్కువగా టార్గెట్ చేయడం వల్లే తమకు తీవ్ర నష్టం జరిగిందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తుందట.

ఆ కారణంగానే జగన్ తన స్వరాన్ని సవరించారన్న టాక్ వినిపిస్తోంది.పవన్, చంద్రబాబును విడదీసి పాలిటిక్స్ ప్లే చేయాలనుకున్నారట. కానీ వైసీపీ ఎత్తులు తలకిందులు అవ్వడమే కాకుండా పవన్, చంద్రబాబు మధ్య బంధం మరింత బలపడింది. పవన్ ఒంటరిగా పోటీ చేస్తే ఓట్లు చీలి తాను మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ అండ్ కో స్కెచ్ అనుకునేవారట. అందుకే చంద్రబాబు కన్నా ఎక్కువగా పవన్ వెంట పడేవారట.కానీ జగన్ అంచనాకు భిన్నంగా ఆ ఇద్దరూ ఒక్కటవ్వడంతో అధికారం వైసీపీ చేతుల నుంచి జారిపోయిందంటున్నారు. ఎన్నికల తర్వాత కార్యకర్తలు, పలువురు నేతలతో పలుమార్లు మాట్లాడిన జగన్..పవన్ విషయంలో విమర్శల డోస్ ఎక్కువైందన్న విషయాన్ని గ్రహించారట. అందుకే ఇప్పుడు ఆయన జోలికి వెళ్లకుండా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని అంటున్నారు.మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో ములాఖత్ అయ్యేందుకు విజయవాడ సబ్‌జైలుకు వెళ్లిన జగన్..మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌పైనే తీవ్ర విమర్శలు చేశారు.

అరగంట సేపు మీడియాతో మాట్లాడిన జగన్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలకంగా పనిచేస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌ను ఒక్క మాట కూడా ఆడలేదు. ప్రభుత్వం అరెస్ట్‌లు చేస్తుంటే పవన్ ఏం చేస్తున్నారన్న ప్రశ్న కూడా వేయలేదన్న చర్చ జరుగుతోంది. ఇది జగన్‌లో మారిన వైఖరికి ఎగ్జాంపుల్ అని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.డిప్యూటీ సీఎం హోదాలో పవన్ మాట్లాడిన తర్వాతే వైసీపీ సోషల్ మీడియా అరెస్టులు జరిగాయని, పవన్‌ను రెచ్చగొడితే రాజకీయంగా జరిగే లాభం కన్నా, నష్టమే ఎక్కువగా ఉంటోందని వైసీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే తమ అధినేతకు చెప్పి.. పవన్ విషయంలో సాఫ్ట్‌గా మాట్లాడాలని.. అవసరమతే ఆయన ప్రస్తావన తేకపోవడమే బెటరని సూచించినట్లు తెలుస్తోంది. తమ సూచనతో జగన్ రూట్ మార్చారని పలువురు వైసీపీ లీడర్లు గుసగుసలు పెట్టుకుంటున్నారు. జగన్ మద్దతుదారులుగా ఉన్నవారు కూడా పవన్‌కు అనుకూలంగా జపం చేస్తున్నారు. రేపోమాపో వైసీపీలో చేరబోతున్నారంటున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అయితే ఏపీకి ఆశాకిరణం పవన్ ఒక్కడేనని ఆకాశానికి ఎత్తుతున్నారు. కేంద్రం నుంచి ఏపీకి ఏది సాధించాలన్న పవన్‌తోనే సాధ్యం అవుతదని చెప్పుకొచ్చారు. ఇక మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అయితే ఎన్నికల ఫలితాల తర్వాత పవన్‌ను తక్కువ అంచనా వేశామని ఒప్పుకున్నారు.యూత్‌లో పవన్‌కు ఉన్న క్రేజ్.. కూటమి బంపర్ విక్టరీకి ఉపయోగపడిందని కూడా చెప్పేశారు.

లాస్ట్‌కు వైసీపీని వీడిన విజయసాయిరెడ్డి కూడా పవన్ పట్ల సాఫ్ట్ వాయిస్ వినిపించారు. ఇలా వైసీపీ అధినేత సన్నిహితులుగా ఉన్న వారంతా పవన్‌ను పొగుడుతున్నారు. జగన్ మాత్రం పవన్ పేరెత్తకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో సేనాని సెగ వైసీపీకి గట్టిగానే తాకిందన్న చర్చ జరుగుతోంది.



## పోస్ట్ ఆఫీస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నర్సారెడ్డి కి ఘన సన్మానం

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 21 :**

గజ్వేల్ మున్సిపాలిటీలోని పోస్ట్ ఆఫీస్ ఐఓసీ భవనంలో మొదటి అంతస్తులో ఉండడంతో పోస్ట్ ఆఫీస్ ఖాతాదారులు అలాగే వృద్ధులైన పెన్షన్ దారులు చాలా ఇబ్బందుల గురి అయ్యారు. ఇట్టి విషయంలో నర్సారెడ్డి చొరవ తీసుకొని కలెక్టర్ తో మాట్లాడి పోస్ట్ ఆఫీస్ ను అందరికీ అణువుగా ఉండేట్టు గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేయించడం జరిగింది. దీనితో అటు ఖాతాదారులు ఇటు పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు కూడా సంతోషించి ఈ విషయమై నర్సారెడ్డి ని కలిసి ఆయనకు కృతజ్ఞత తెలిపి శాలువాతో సత్కరించారు.టిపిసిసి సెక్రెటరీ సాజీద్ బేగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్ డాక్టర్ వహీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ ,మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సమీర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు జాంగిర్, యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నేత నాగరాజు, ధర్మారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ సుఖేందర్ రెడ్డి, ఉడెం శ్రీనివాస రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, చెప్యాల శేఖర్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు

## నవోదయలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం




**జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 21 :**

వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయ శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగిందని విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీ దాసి రాజేందర్ తెలియజేశారు.తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమము అందరినీ రంజింప చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి శ్రీమతి ఝాన్సీ రాణి తెలుగు అధ్యాపకురాలు ప్రయోక్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు తెలుగు సామెతలు, తెలుగు పద్యాలు, తెలుగు జాతీయాలు మరియు వ్యాసాల పట్ల చక్కటి సమాచారాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మరొక తెలుగు అధ్యాపకుడు శ్రీ ఎం విజయ్ కుమార్ ఇంటర్నేషనల్ మాతృభాషా దినోత్సవం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఎవరైనా తమ మాతృభాషలో చక్కటి పరిణితి సాధిస్తే ఇతర భాషలు నేర్చుకోవడం చాలా సులువు అవుతుందని ఆయన ఈ సందర్భంగా నొక్కి వక్కాణించారు. విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీ దాసి రాజేందర్ తన ఉపన్యాసంలో తెలుగు భాష ప్రాముఖ్యత, దాని ఆవశ్యకతను చక్కటి ఉదాహరణలతో వివరించారు.నవోదయ విద్యాలయ లక్ష్యాల్లో ఒకటైన త్రిభాషా సూత్ర అమలు ఈ విద్యాలయంలో చక్కగాజరుగుతుందని మరియు అందరి సహాయ సహకారాలు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయ ,వర్గల్ తెలుగు విభాగానికి ఆయన తన కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో విద్యాలయ అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి అండగా తీర్మాలన్న యువసేన



**జయభేరి, మార్కుక్, ఫిబ్రవరి 21 :**

మార్కుక్ మండలం పాములపర్తి గ్రామనికి చెందిన చిన్నబోయిని లక్ష్మణ్ అనారోగ్యంతో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న తాజా మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి యువసేన తరుపున ఆర్థిక సహాయం చేయడం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పసర్పంచ్ పద్మనర్సింలు,చెక్కలి మలేష్,క్రాంతికుమార్,లక్ష్మణ్, రాజయ్య,కిషన్,ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- కమిషనర్ కు సిపిఎం వినతి




**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 21:**

మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ గృహ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ కమీషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ.. పరకాల పట్టణంలో మున్సిపల్ పరిధిలోని 4,9,15,18,19, వార్డుల పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయి. అలాగే వ్యాపార సముదాయాలు సైతం అనుమతి మేరకు కాకుండా ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తున్నారు. అలాంటి నిర్మాణలపై పరకాల టౌన్ ప్లానింగ్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అనేక నిర్మాణాలు అనుమతులు లేకుండానే పట్టణ పరిధిలో కొనసాగుతున్నాయి. అలా నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాల పట్ల తక్షణమే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ కాలంలో ఇబ్బందులకు గురి కాకుండా వెంటనే విచారణ జరిపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కళ్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హేమంత్ ఈశ్వర్ పాల్గొన్నారు.

# 'హరిహర వీరమల్లు' నుంచి కొల్లగొట్టినాదిరో రిలీజ్


నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం హరిహర వీరమల్లు. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మాట వినాలి అనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా సెకండ్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా నుంచి కొల్లగొట్టినాదిరో అనే రెండో సింగిల్ ప్రోమోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. కోర కోర మీసాలతో కోదమ కోదమ అడుగులతో.. జర జర వచ్చినాడు చిచ్చర పిడుగంటివాడు అంటూ విడుదల చేసిన ప్రోమో గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ సినిమాలో చాలా రోజుల తర్వాత ఒక సూపర్ హిట్ సాంగ్ రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ పాటలో నిధి అగర్వాల్‌తో పాటు అనసుయ కూడా తళుక్కున మెరిసింది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.






# 3 నిమిషాలకు 3 కోట్ల రెమ్యునరేషన్..

ఆమె కెరీర్ లో ఒక్క హిట్ కూడా లేదు. కానీ కేవలం మూడు నిమిషాల కోసం ఏకంగా రూ. 3 కోట్లు పారితోషికం తీసుకుంటుంది. ఆమె గ్లామర్ పాత్రలకు.. స్పెషల్ సాంగ్స్ కు కేరాఫ్ అడ్రస్. సన్నీ డియోల్‌తో అరంగేట్రం చేసి హృతిక్ రోషన్‌తో సహా అనేక మంది సూపర్‌స్టార్‌లతో కూడా పనిచేసింది. ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ అమ్మడు జోరు కొనసాగుతుంది. ఇంతకీ ఆమె ఎవరో కాదు.. హీరోయిన్ ఊర్వశి రౌతేలా. సినిమా రంగంలోకి రాకముందు అనేక అందాల పోటీలలో గెలిచింది ఈ ముద్దుగుమ్మ. అయితే సినీరంగం మాత్రం ఈ బ్యూటీకి కలిసిరాలేదు. అయినప్పటికీ ఆమె క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. నిమిషానికి కోటి చొప్పున మూడు నిమిషాల కోసం రూ. 3 కోట్లు పారితోషికం తీసుకుంటుంది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ ఊర్వశీ రౌతేలా. ఇప్పటికే హిందీ, తెలుగులో అనేక చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. ఇటీవలే నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. ఇందులో 3 నిమిషాల పాట కోసం రూ. 3 కోట్లు పారితోషికం తీసుకున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఊర్వశి రౌతేలా ఆస్తుల విలువ రూ. 236 కోట్లు అని సమాచారం. ఆమెకు ఇన్ స్టాలో 73 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఊర్వశి రౌతేలా 2013లో సన్నీ డియోల్ సరసన సింగ్ సాబ్ ది గ్రేట్ చిత్రంతో తెరంగేట్రం చేసింది. ఆ సమయంలో ఆ నటి వయసు కేవలం 19 సంవత్సరాలు. సింగ్ సాబ్ ది గ్రేట్ బాక్సాఫీస్ వద్ద సూపర్ ఫ్లాప్ అయింది. ఆ తర్వాత ఆమె నటించిన చిత్రాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి పదేళ్లు గడుస్తున్నప్పటికీ ఆమె ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. ఇప్పటికీ ఈ అమ్మడికి సరైన బ్రేక్ రాలేదు. కానీ స్పెషల్ పాటలతో ఓ రేంజ్ క్రేజ్ సొంతం చేసుకుంది.



# సెల్ఫీ కోసం వచ్చి ఏకంగా..

సాధారణంగా సినీతారలకు అభిమానుల నుంచి చాలా సందర్భాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో సెల్ఫీల కోసం వచ్చి హీరోయిన్లను ఇబ్బందులకు గురి చేస్తుంటారు పలువురు ఆకతాయిలు. తాజాగా ఓ హీరోయిన్ కు సైతం ఊహించని షాకిచ్చాడు ఓ అభిమాని. బాలీవుడ్ ఇండస్ట్రీలో ఒకప్పుడు స్పెషల్ పాటలకు కేరాఫ్ అడ్రస్ ఆమె. కానీ కొన్నాళ్లుగా ఆమె క్రేజ్ పూర్తిగా పడిపోయింది. ఇక ఆ తర్వాత ఎప్పుడూ వివాదాలతోనే వార్తలలో నిలిచింది. తాజాగా సెల్ఫీ కోసం వచ్చిన అభిమాని చేసిన పనికి షాకయ్యింది. ఆమె మరెవరో కాదు.. బీటౌన్ బ్యూటీ పూనమ్ పాండే. ఇప్పటికే ఎన్నోసార్లు వివాదాలతో వార్తలలో నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీకి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతుంది. ముంబై వీధుల్లో పూనమ్ పాండేను ఓ అభిమాని బలవంతంగా ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. దీంతో పూనమ్ పాండే భయపడి పక్కకు తప్పుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతుంది. తాజాగా ముంబై వీధుల్లో కనిపించిన పూనమ్ పాండేను పాపరాజ్జీలు ఫోటోస్ తీయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో ఓ అభిమాని వచ్చి పూనమ్ తో సెల్ఫీ కావాలని అడిగాడు. దీంతో ఆమె అంగీకరించింది. పూనమ్ పాండే కూడా ఒక అడుగు దూరం నుండి సెల్ఫీ తీసుకోవడానికి ఒప్పుకుంది. కానీ ఆ వ్యక్తి మరింత దగ్గరగా వచ్చి పూనమ్ కు ముద్దు పెట్టేందుకు ప్రవర్తించాడు. అప్పుడు పూనమ్ పాండే భయంతో వెనక్కు జరిగింది. అయితే ఈ వీడియో చూసిన నెటిజన్స్ విభిన్నంగా కామెంట్స్ చేస్తున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన డ్రామా అని కొందరు అంటున్నారు. ఈ డ్రామా ముందుగానే ప్లాన్ చేసుకున్నదని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం చాలా వైరల్ అవుతోంది. పూనమ్ పాండే నాటకం ఒకటి రెండు కాదు. అంతకుముందు, అతనే తన మరణానికి సంబంధించిన నకిలీ వార్తలను ప్రచారం చేసింది.



# అతిథి పాత్రలో హరీశ్‌శంకర్

అతిథి పాత్రలో హరీశ్ శంకర్ ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ వెండితెరపై అతిథి పాత్రలో మెరవనున్నారు. 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో ఆయన కీలకమైన గెస్ట్ రోల్‌ను పోషించారు.

ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ వెండితెరపై అతిథి పాత్రలో మెరవనున్నారు. 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో ఆయన కీలకమైన గెస్ట్ రోల్‌ను పోషించారు. సుహాస్, మాళవిక మనోజ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ గోధల దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మాత. ఈ వేసవిలో సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. 'హరీశ్ శంకర్ అతిథి పాత్ర అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ పాత్ర ఆయన చేస్తేనే బాగుంటుందని భావించాం. హరీశ్ శంకర్‌కు సంబంధించిన సన్నివేశాలను ఇటీవలే పూర్తి చేశాం. ఆద్యంతం వినోదంతో ఆకట్టుకునే చిత్రమిది' అని మేకర్స్ తెలిపారు. అనితా హసనందిని, అలీ, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రథన్, రచనదర్శకత్వం: రామ్ గోధల.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com